నేలపాలైన రైతు కష్టం

- వడగండ్ల వర్షంతో పంట నష్టం
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల.. వడగండ్ల వర్షం రైతులకు తీవ్ర వేధనను మిగిల్చాయి.. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వడ్లు, మామిడి రాలిపోయాయి. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం కూడా వరదలో కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టం చేసి పంట పండిస్తే నోటి కాడికి వచ్చే సమయంలో నేలపాలైంది. దెబ్బతిన్న పంటలను బుధవారం అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. రైతులకు ధైర్యం చెప్పారు. కాగా, హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి ఇటుకలు పడి చిన్నారి మరణించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పంటలకు నష్టం వాటిల్లింది. మంగళవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పంటలు నేలవాలాయి. ఆదిలాబాద్ జిల్లాలో తొమ్మిది మండలాల్లో మొక్కజొన్న, జొన్న పంటలకు నష్టం వాటిల్లగా.. కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లాలోనూ సిర్పూర్, కాగజ్‌నగర్ తదితర అన్ని మండలాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. వరి పైరు నేలకొరిగి ధాన్యం నేల రాలిపోయాయి. నిర్మల్ జిల్లాలోనూ మొక్కజొన్న, జొన్న, వరి పంటలకు నష్టం వాటిల్లింది. కడెం మండలంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి పంటలను పరిశీలించారు. మంచిర్యాల జిల్లాలోనూ ఇదే స్థాయిలో పంట నష్టం జరిగింది. ఆయా జిల్లాల అధికార యంత్రాంగం నష్టపోయిన పంటలను పరిశీలించి అంచనా వేస్తోంది. నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షం రైతన్నకు తీవ్ర నష్టం చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 41,711 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇటీవల కాలంలో ఇంత భారీ మొత్తంలో పంట నష్టం జరగడం ఇదే మొదటిసారి. ఒక్క కామారెడ్డి జిల్లాలోనే 31 వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగింది. ఇందులో 31,128 ఎకరాల్లో వరి పంట ఉంది. చేతికొచ్చిన పంట నీట మునగడంతో రైతన్న కన్నీరు మున్నీరవుతున్నాడు. నిజామాబాద్ జిల్లాలో ఎనిమిది వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ధాన్యం గింజలన్నీ నేలరాలాయి. తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తేనే రైతన్నకు కొంత ఊరట లభించనుంది. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల కలెక్టర్ జితేశ్ వి పాటిల్, వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించారు. బాన్సువాడలో స్పీకర్ పోచారం, ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నరసన్నపల్లి, పొందుర్తిలో పరిశీలించారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. సిద్ధిపేట జిల్లాలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంట పొలాలను బుధవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. మంత్రి రైతులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. పంట నష్టపోయిన రైతులను కాపాడుకుంటామని భరోస కల్పించారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లిస్తామని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తెలిపారు. మద్దూరు దూల్మిట్ట మండలంలోని లద్నూరు రేబర్తి వల్లంపట్ల బైరాన్ పల్లి బెక్కల్ తోర్నాల దూల్మిట్ట లింగాపూర్ గ్రామాలలో ఎంపిపి సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి తో కలిసి పంట నష్టాన్ని పరిశీలించారు. మద్దూరు మండలంలో ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వర్షానికి పంట నష్టపోవడంతో సిపిఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి ఆధ్వర్యంలో బుధవారం పొలాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు పర్యటించి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రైతులను ఆదుకోవాలని కోరారు.

సంగారెడ్డి జిల్లాలో 15 మండలాల్లో వరి, జొన్న, మొక్కజొన్న, టమాటా, ఉల్లి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 258 గ్రామాల్లో 4047.28 ఎకరాల్లో 33 శాతం పంట నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు గుర్తించారు. 3093 మంది రైతులకు రూ.4.04 కోట్ల పంట నష్టం మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. ఐదు రోజులుగా సిద్దిపేట జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. వరి, జొన్న, మొక్కజొన్న పైర్లు నేలవాలాయి. పెద్దపెద్ద వడగండ్లు పడటంతో ధాన్యం నేలరాలింది. మెదక్‌లో భారీ వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లాలో మాత్రం ఈనెల మొదటి వారం నుంచే వర్షాలు పడుతున్నాయి. వరి, జొన్న, మొక్కజొన్న, టమాటా, ఉల్లి పంటలు దెబ్బతిన్నాయని అధికారులు గుర్తించారు. ముందుస్తుగా నష్టాన్ని అధికారులు అంచనా వేసి నష్టపరిహారం కోసం పంపారు. రోజూ వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం రాసులు తడుస్తున్నాయి. వరద నీటిలో ధాన్యం కొట్టుకుపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సరిపడా తార్పాలిన్లు లేకపోవడంతో ధాన్యం రాసులు తడుస్తున్నాయి. గతంలో సీఎం ప్రకటించిన ఎకరానికి రూ.10 వేల నష్టపరిహారం సంగారెడ్డి జిల్లాలోని 15 మండలాల రైతులకు మంజూరైందని కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు.

పంట నష్టం అంచనా వేస్తున్న అధికారులు

రాష్ట్రంలో 50 కరోనా కేసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బుధవారం ఒక్క రోజే 50 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కోవిడ్ స్టేటస్ బులెటిన్ విడుదల చేసింది. 50 మంది కరోనా నుంచి కోలుకున్నారు. 363 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరోనా అనుమానిత లక్షణాలున్న 5,813 మందికి టెస్టులు చేయగా వారిలో 0.86 శాతం మందిలో కోవిడ్-19 ఉన్నట్టు ఫలితాల్లో వెల్లడైంది. అంతకుముందు వారంలో మంగళవారం 52, సోమవారం 54, ఆదివారం 51, శనివారం 49, శుక్రవారం 55, గురువారం 52 చొప్పున కేసులొచ్చిన సంగతి తెలిసిందే.

విదేశీ శిశువుకు ప్రాణం పోసిన మెడికవర్ వైద్యులు

హైదరాబాద్ : గుండె సంబంధిత వ్యాధి (వెంట్రిక్యులర్ సెప్టల్ డిఫెక్ట్-విఎస్‌డి)తో బాధపడుతున్న విదేశీ శిశువుకు మెడికవర్ హాస్పిటల్ వైద్యులు ఆపరేషన్ లేకుండా విజయవంతంగా చికిత్స అందించి ప్రాణాలను కాపాడారు. సోమాలియాకి చెందిన ముస్తల్ఫా అబ్రిస్క్ అహ్మద్ అనే 11 నెలల పాప ఏడు కిలోల బరువుతో ఉంది. ఆ చిన్నారి విఎస్‌డి అని పిలవబడే రంధ్రంతో బాధపడుతుంది. సోమాలియా వైద్యులు పాపకి ఓపెన్ హార్ట్ సర్జరీ చేసి గుండె రంధ్రం పూడ్చాలని సూచించారు. అదే సమయంలో వారికి మెడికవర్ హాస్పిటల్స్‌లోనే పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆశిష్ సప్రె గురించి తెలుసుకొని ఇక్కడికి వచ్చారని మెడికవర్ హాస్పిటల్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. పాపను పరీక్షించిన వైద్యులు చిన్న వయసు కాబట్టి ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయని.. కోత లేకుండా గుండె ప్రొసీజర్ నిర్వహించి రంధ్రాన్ని పూడ్చడం జరిగిందని డాక్టర్ ఆశిష్ సప్రె తెలిపారు.

రూ.30 కోట్లతో శ్రీ బయోస్తెటిక్స్ సెంటర్

హైదరాబాద్ : శ్రీ బయోస్తెటిక్స్ హైదరాబాద్ పరిసరాల్లో రూ.30 కోట్లతో అగ్రి బయోటెక్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. సుల్తాన్‌పూర్ టిఎస్ఐఐసిలో 1.5 ఎకరాల స్థలంలో ఈ యూనిట్‌ను అందుబాటులోకి తేనున్నామని ఆ కంపెనీ ఎండి కెఆర్‌కె రెడ్డి తెలిపారు. దీని ద్వారా 200 మందికి ఉపాధి లభించనుందని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆర్అండ్‌డి, ఉత్పత్తి, సర్వీసు సేవలను అందించనున్నామన్నారు. తమ పరిశోధనల ద్వారా రైతులకు నాణ్యమైన వ్యవసాయ ముడి ఉత్పత్తులను, టెస్టింగ్ సర్వీసెస్ అందించనున్నామన్నారు.

లారీ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఇథనాల్ పరిశ్రమ పెట్టొద్దు

- ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని పాషిగామ గ్రామంలో ఇథనాల్ పరిశ్రమ చిచ్చు కొనసాగుతూనే ఉంది. పరిశ్రమను ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన కొనసాగిస్తున్న గ్రామస్తుల్లో బుధవారం గోపతి మల్లన్న లారీకి ఉరేసుకునేందుకు ప్రయత్నించాడు. అదే గ్రామానికి చెందిన నలిమల సత్తవ్వ ఉరేసుకునేందుకు యత్నించి సొమ్మసిల్లి పడిపోయింది. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. తమ గ్రామాల్లో ఇథనాల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయకూడదంటున్నా.. మళ్లీ పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా ఫ్యాక్టరీ పనులు చేయాలనుకుంటే సామూహిక ఆత్మహత్య చేసుకుంటామని పోలీసులను హెచ్చరించారు. స్థానిక ఎస్ఐ నరేష్ ప్రజలకు ఎంతగా నచ్చచెప్పినా వారు పట్టు విడవకుండా నిరసన కొనసాగించారు. పని చేస్తున్న ప్రోక్లైన్లు అక్కడి నుంచి పంపిస్తేనే నిరసన విరమిస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఫ్యాక్టరీ పనులు చేపట్టేందుకు ఓ లారీలో ప్రొక్లెయిన్ తీసుకురాగా.. పరిసర గ్రామాల ప్రజలు దానిని కిందకి దించకుండా లారీ కింద కూర్చొని అడ్డుకున్నారు. సుమారుగా ఐదు గంటలపాటు లారీకి అడ్డంగా కూర్చుని ఎండలో నిరసన తెలిపారు. తమ ఊరి పొలిమేరలు కనిపించే విధంగా హరిత హోటల్ పరిసరాల్లో బిగించిన సిసి కెమెరాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వీరందరికీ సామాజిక కార్యకర్త మోతె నరేష్ మద్దతుగా నిలిచారు. సిసి కెమెరాలు తొలగించడంతోపాటు మరో రెండు ప్రోక్లైన్లను కొద్ది రోజుల్లోనే వెనక్కి పంపిస్తామని ప్రజలకు ఎస్ఐ నరేష్ కుమార్ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు నిరసన విరమించారు.

3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- సర్దార్ రవీందర్ సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్లపై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్ విమర్శించారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు తెరవడం వల్లనే ధాన్యం తడిచిపోయిందన్న బండి ఆరోపణల్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుంచి కొనుగోలు ప్రారంభించాలని ఆదేశించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని 13వ తేదీ నుంచే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు ఇప్పటి వరకు 3 వేల కేంద్రాలను ప్రారంభించి 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు చెప్పారు. గతేడాది ఇదే సమయానికి 93 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసినట్టు తెలిపారు. బండి సంజయ్ ఆరోపణలు రైతాంగాన్ని తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయనీ, వాటిని రైతులు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. ఇప్పటికే పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ గారు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు అభయమిచ్చారని పేర్కొన్నారు. ప్రచారం కోసం వాస్తవాలను వక్రీకరించి మాట్లాడడం బండి సంజయ్‌కే చెల్లుబాటవుతుందని విమర్శించారు. చేతనైతే రాష్ట్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించేందుకు కేంద్రం నుంచి కమిటీని రప్పించాలనీ, ఎలాంటి షరతులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చూడాలని సవాల్ చేశారు.

సిఎంఆర్ ఇవ్వడంలో సమస్యలేంటి?

- 15 రోజుల్లోగా ఇవ్వాల్సిందే
- పౌర సరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైస్ మిల్లర్ల నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) సేకరణలో మరింత కఠినంగా వ్యవహరించాలని పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో అదే స్థాయిలో సిఎంఆర్ సేకరణలో కూడా ప్రదర్శించాలని సూచించారు. బుధవారం పౌరసరఫరాల భవన్‌లో సంస్థ ఎండి అనిల్‌కుమార్‌తో కలిసి 2019-20లో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఎంఆర్ అధికంగా పెండింగ్‌లో ఉన్న వనపర్తి, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ, ములుగు, నాగర్‌కర్నూల్ జిల్లాల డీఎస్‌ఓలు, డీఎంలు డిఫాల్ట్ రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీందర్ సింగ్ మాట్లాడుతూ సిఎంఆర్‌లో జాప్యంతో వడ్డీ భారం పెరుగుతున్నదని తెలిపారు.

సిఎంఆర్ అప్పగించడంలో మీకున్న సమస్యలేంటి, 90 మిల్లర్లుకు లేని ఇబ్బంది మీకే ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్‌తోపాటు కొత్తగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల వల్ల రాష్ట్రంలో గణనీయంగా ధాన్యం దిగుబడి, కొనుగోళ్లు పెరిగాయని చెప్పారు. ఒక తెలంగాణ రాష్ట్రం మినహా దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయా రాష్ట్రంలో పండిన పంటలో పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడం లేదన్నారు. గతంలో మిల్లర్లు రైస్ మిల్లును నడపలేక రేకులు అమ్ముకునే స్థితి నుంచి సిఎం కెసిఆర్ తీసుకున్న చర్యలతో కొత్తగా రైస్ మిల్లును ఏర్పాటు చేసే స్థాయికి చేరుకున్నారని గుర్తు చేశారు. 2019-20లో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లు 15 రోజుల్లోగా బకాయి పడిన బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఆయా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. మిల్లర్ల నుంచి సీఎంఆర్ తీసుకునే సమయంలో నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొద్దని అధికారులను కోరారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ రాజారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి

- రెజ్లర్ల పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మళ్లీ ఆందోళనకు దిగిన రెజ్లర్ల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయంగా అనేక పతకాలు సాధించి దేశానికి గౌరవాన్ని, ప్రతిష్టను తెచ్చిపెడుతున్న అగ్రశ్రేణి క్రీడాకారులైన రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేయడం అత్యంత దురదృష్టకరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు "బేటీ బచావో బేటీ పడావో" అంటూ ప్రవచనాలు పలుకుతున్నదని పేర్కొన్నారు. మరోవైపు ఈ దారుణమైన నేరంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్‌గా ఉన్న బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను రక్షించేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. మహిళా రెజ్లర్లు దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం కూడా ఈ ఆరోపణలు చాలా తీవ్రమైనవిగా పేర్కొంటూ ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. అయినా ప్రభుత్వం, పోలీసుల నుంచి స్పందనలేదని పేర్కొన్నారు. గతంలో రెజ్లర్లు ఈ విషయంపై ఆందోళన చేసిన సందర్భంగా ప్రభుత్వం కొన్ని హామీలిచ్చినప్పటికీ అమలు దిశగా చర్యలు లేకపోవడంతో వారు ఢిల్లీలో మళ్లీ ఆందోళనకు దిగాల్సి వచ్చిందని వివరించారు. బ్రిజ్ భూషణ్‌పై వెంటనే కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి

- నేడు దేశవ్యాప్త నిరసనలకు ప్రజాసంఘాల పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షులు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తూ ఢిల్లీలో పోరాటం చేస్తున్న రెజ్లర్లకు న్యాయం చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. రెజ్లర్లకు మద్దతుగా దేశవ్యాప్తంగా గురువారం నిరసనలు తెలుపనున్నట్టు ప్రకటించాయి. ఈ మేరకు ఆయా ప్రజా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పాలడుగు భాస్కర్ (సిఐటియు), టి.సాగర్(తెలంగాణ రైతుసంఘం), ఆర్.వెంకట్రాములు(వ్యవసాయ కార్మిక సంఘం), మల్లు లక్ష్మి(ఐద్వా), అనగంటి వెంకటేశ్(డివైఎఫ్ఐ), టి.నాగరాజు(ఎస్ఎఫ్ఐ) బుధవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షులతో పాటు కొందరు కోచ్‌లు తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ప్రముఖ మహిళా రెజ్లర్లు ఫిర్యాదు చేసినా కేంద్రం స్పందించకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇంతవరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని వాపోయారు. 'బేటీ బచావో బేటీ పడావో' అంటూ సంబరాలు చేసుకుంటూనే, మరోవైపు ఈ దారుణమైన నేరంలో నిందితుడైన బిజెపి ఎంపిని రక్షించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. మూడు నెలలుగా రెజ్లర్లు పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఒలింపిక్, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశప్రతిష్టను పెంచిన క్రీడాకారుల పట్ల మోడీ సర్కారు ఇలా వ్యవహరించడం అన్యాయమని తెలిపారు. న్యాయవిచారణ కోరుతున్నామని రెజ్లర్లు చెబుతున్నా కేంద్ర పట్టించుకోకపోవడం సరిగాదని తెలిపారు. మల్లయోధుల ఆరోపణలపై విచారణ జరిపిన పర్యవేక్షక కమిటీ ఫలితాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. దోషులను శిక్షించే వరకు తాము వెనక్కి తగ్గబోమని రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. నిందితులపై ఫోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రెజ్లర్లకు సంఘీభావంగా గురువారం అన్ని జిల్లా కేంద్రాల్లోనూ, హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్డులో జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మేడే సందర్భంగా అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో మే ఒకటో తేదీన మేడే వేడుకలు జరుగుతాయని కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ల నేతలకు, ఉత్తమ యాజమాన్యాలకు మేడే అవార్డులు అందిస్తామని తెలిపారు. ఈమేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, ప్రజాప్రతినిధులు, ట్రేడ్ యూనియన్ల నాయకులు, పాల్గొంటారని తెలిపారు.

మే 3 నుంచి సమ్మె

- టి జూడా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపకారవేతనాలను 15 శాతం పెంపు ఈ ఏడాది జనవరి నుంచి వర్తింపజేయాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం టీజూడా అధ్యక్షులు డాక్టర్ కౌశిక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్న్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ రెసిడెంట్లు, సూపర్ స్పెషాలిటీ రెసిడెంట్లకు ఉపకారవేతనం పెండింగ్ ఉందని తెలిపారు. ఈ సమస్యను 15 నుంచి 20 రోజుల్లో పరిష్కరిస్తామని డీఎంఈ ఇచ్చిన హామీ మేరకు గతంలో సమ్మెను వాయిదా వేసిన విషయాన్ని గుర్తుచేశారు. మే 2 వరకు వేచి చూస్తామనీ, అప్పటికీ సమస్య పరిష్కరించకుంటే మే 3 నుంచి అత్యవసర సేవలు మినహా అన్ని సేవలను జూనియర్ డాక్టర్లు బహిష్కరించి సమ్మెకు వెళతామని హెచ్చరించారు.

29న ఫూలే అంబేద్కర్ జనజాతర

- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ
- 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ సామాజిక విప్లవానికి సారథులుగా నిలిచిన మహాత్మ జ్యోతిబాఫూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లక్ష్యాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా ఏప్రిల్ 29న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి ఫూలే అంబేద్కర్ జనజాతర నిర్వహిస్తున్నట్టు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద జనజాతర కరపత్రాలను టిపిఎస్‌కె రాష్ట్ర కార్యదర్శి జి.రాములు ఆవిష్కరించారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలు రాజ్యాంగాన్ని రద్దు చేసే విధంగా ఉన్నాయన్నారు. మనువాద ఎజెండాతో ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పరిపాలన చేస్తున్న బిజెపి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పేదలపై పెనుభారాలు మోపుతున్నదన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం రాజకీయాలకతీతంగా ఐక్య ఉద్యమం చేపడుతామన్నారు. రాములు మాట్లాడుతూ.. జన జాతరలో ప్రజలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌శ్రీరామ్‌నాయక్, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మానాయక్, కెవిపిఎస్ హైదరాబాద్ మేడ్చల్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.దశరథ్, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తేలికపాటి నుంచి మోస్తరు వానలు

- కొన్ని ప్రాంతాల్లో వడగండ్లు పడే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు తేలిక పాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. రాష్ట్రంలో గురువారం కూడా గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయడంతో పాటు వడగండ్లతో కూడిన భారీ వర్షాలు కూడా అక్కడక్కడా పడొచ్చని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలను జారీ చేశారు. ఆరెంజ్ హెచ్చరికల జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, నల్లగొండ, వికారాబాద్, మెదక్ జిల్లాలున్నాయి. ఆయా జిల్లాల్లో ఒకటెండ్రు ప్రాంతాల్లో భారీ వర్షాలు కూడా పడొచ్చని హెచ్చరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఈదురుగాలులు వీచాయి. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నల్లగొండ, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా వడగండ్లు పడ్డాయి. ఐదు రోజుల కిందటితో పోలిస్తే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీల మేర తగ్గాయి. రాష్ట్రమంతటా బుధవారం 40 డిగ్రీల లోపే నమోదయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 39.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. అదే జిల్లాలోని డిచ్‌పల్లిలో అత్యధిక వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లోనూ పలుచోట్ల తేలికపాటివర్షం కురిసింది. రాబోయే 48 గంటల పాటు హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముంది.

ఫారం నం. యుఆర్‌సి-2
చట్టం యొక్క చాప్టర్ 21 యొక్క పార్ట్-1 క్రింద రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నోటీసు ఇచ్చు ప్రకటన.
(కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 374(బి) మరియు కంపెనీల (అథొరైజ్డ్ టు రిజిస్టర్) రూల్స్, 2014 అనుసరించి)

1. ఇందుమూలంగా కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 366 యొక్క సబ్‌సెక్షన్ (2) అనుసరించి ప్రకటన ఇవ్వడమేమనగా, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసిఏ), ప్లాట్ నం.6,7,8, సెక్టార్‌5, ఐఎంటి మనేసర్, గుర్గ్రాం122050 (హర్యానా) వద్ద రిజిస్ట్రార్ అనువారు, వాటాల ద్వారా కంపెనీ లిమిటెడ్‌గా, కంపెనీల చట్టం 2013 యొక్క చాప్టర్ 21 యొక్క పార్ట్ 1 క్రింద "శ్రీ బాలాజీ డెవలపర్స్& బిల్డర్స్" పార్టనర్‌షిప్ సంస్థగా దరఖాస్తుచేయవలసిందిగా ప్రతిపాదిస్తున్నారు.
2. కంపెనీ యొక్క ప్రధాన అంశాలు దిగువ విధంగా: ఎ) కంపెనీల చట్టం, 2013 యొక్క చాప్టర్ 21 యొక్క పార్ట్ 1 యొక్క నియమాలననుసరించి ఇన్‌కార్పొరేషన్ తేదినాటికిగల ఏదైతే దాని ఆస్తులు మరియు అప్పులుతోసహా సర్వే నం.610/12, మౌలాలి, మల్కాజిగిరి, రంగారెడ్డి, హైదరాబాద్-500 040 వద్ద ఆఫీసు కలిగియుండి "శ్రీ బాలాజీ డెవలపర్స్& బిల్డర్స్" యొక్క ప్రస్తుత వ్యాపారంచేపట్టుటకు.
బి) ఎస్ఆర్ఎన్: ఎఏ1996144 తేది: 18 ఏప్రిల్, 2023 ఆధారంగా సిఆర్‌సికి దరఖాస్తు పేరున పేర్కొన్న ఏదేని ఇతర అంశాలు మరియు సమయానుసారం అంతరంగంగా నిర్ణయించినట్లు తెలంగాణలో లేదా భారతదేశంలోని ఏవేని ఇతర ప్రదేశంలో ప్రధానంగా వ్యాపారం చేపట్టుటకు సమయానుసారం అంతరంగంగా అంగీకరించినట్లుగా సివిల్ నిర్మాణాలు, మౌళిక సదుపాయాల అభివృద్ధి, హైడ్రో పవర్ ప్రాజెక్టులు నిర్మించుట, బ్రిడ్జీలు, టన్నల్స్ మరియు వివిధ శాఖలు, కార్పొరేషన్స్, బోర్డులు మరియు కంపెనీలు మొ॥వారికి మెటీరియల్స్ సరఫరాచేయుట మరియు ఇతర వ్యాపారం చేపట్టుటకు.
3. ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమోరండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ కాపీని, సర్వే నం.610/12, మౌలాలి, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, హైదరాబాద్-500 040, తెలంగాణ, ఇండియా వద్దగల కార్యాలయం వద్ద పరిశీలించవచ్చును.
4. ఈ దరఖాస్తు పట్ల ఎవరికైనా ఏవేని అభ్యంతరాలు ఉన్న ఎవరైనా వ్యక్తి, దానిని పై పేర్కొన్న కంపెనీకి దాని రిజిస్టర్డు ఆఫీసుకు ఒక కాపితో, ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఇరువై ఒక రోజుల్లోగా, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసిఏ), ప్లాట్ నం.6,7,8, సెక్టార్-5, ఐఎంటి మనేసర్, గుర్గాం-122050 (హర్యానా) వద్ద రిజిస్ట్రార్‌కు వ్రాతమూర్వకంగా వారి అభ్యంతరాలను తెలుపవచ్చును.

శ్రీ బాలాజీ డెవలపర్స్& బిల్డర్స్ తరపున
ప్రదేశం: హైదరాబాద్
తేది: 26.04.2023
సం/-
డి. అవన్‌ఇంద్ర కుమార్
మేనేజింగ్ పార్టనర్

In the Court of the Hon'ble District Judge: Ananthapuramu
M.V.O.P.NO.234/2022
Between:
Uppara Chiranjeevi ...Petitioner
V/s
Sreenivas and others ...Respondants

1మరియు 2వ ప్రతివాదికి నోటీసు

1. Sreenivas S/o Kistappa, aged 29 years, R/o Miriyan (Vi), Chincholi Taluk, Gulbarga Dist, Karnataka State.
2. Boppa Ram Reddy S/o Anji Reddy, H.No.2-35, Veerlapalli, Sirupura, Marpally,Vikarabad Dist, Telangana State.

పై దావాలో 1 మరియు 2వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం తేది:05-05-2023వ తేదికి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన కోర్టులో 05-05-2023వ తేదిన ఉదయం 10.30 గం॥లకు స్వయంగా గానీ మీ తరుపున లాయరు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరుకానిచో మీ పరోక్షమున కేసు తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:05-05-2023.
A.Nagarjun Reddy, Advocate
Anantapuramu, Cell:9440874191.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 1257/2017
O.S.No. 164/2011
Shaik Akula Patchu -Petitioner/ Plaintiff
Vs
Shaik. Mahaboob Bee
and others - Respondents/ Defendants

To,
R15. **షేక్.గౌసియా సుల్తాన్,** W/o **మున్వర్ అలీబేగ్,** సైదాపేట్ పోలీస్ స్టేషన్, హైదరాబాద్, తెలంగాణ.

పై నంబరున పిటీషనర్ / వాది మీ మీద (U/O.1, R-10 (2) of C.P.C) పిటీషను పరిహారముల నిమిత్తం పిటీషన్ దాఖలు చేసినందుకు మీకు నోటీసు నిమిత్తం **తేది. 10-05-2023** కి వాయిదా వేసియున్నారు. వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 10-05-2023
కందుకూరు (పాత ప్రకాశం జిల్లా)
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఎ.పి.

వై. సాంబశివరావు
పిటీషనర్ / వాది తరపు అడ్వకేట్
కందుకూరు

IN THE COURT OF THE HON' BLE INTHEHON' BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM X ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, Hyderabad
M.V. O.P No. **1863** OF **2022**
BETWEEN:
Mukyarla Naveen ... Petitioner
AND
1.Venkataramana Reddy Kasireddy S/o K. Rajuma Reddy age: Major, Occupation: Vehicle Owner bearing No. RSO2UC1999 R/o Flat No. 512, Janapriya quarters, Mohan Nagar, Kothapet, Saroornagar, Hyderabad - 500072.
2.Madasu Prabhas S/o Madasu Venkanna Occupation: Driver crime vehicle bearing No. TSO2UC1999 R/o Plot No.5 Rd No.2, Raghavendra colony Mohan nagar, New Nagole, Hayath Nagar, R.R. District-500068.
.. Respondents

Whereas the above named Petitioner filed Petition claiming compensation againstthe Respondents and the case is posted for appearance of Respondent No. 1 & 2 therefore you are hereby directed to appear before the Hon' ble Court on **12-06-2023** at **10:30** am failing which the case will be heard and decided as per law.

// BY ORDER OF THE COURT //
G.GOPAL REDDY
K. RAJA RAO,
Advocates
202, Rahmatha Complex, Ameerpet, "X" Road, Hyderabad.

నిర్లక్ష్యపు నీడన ఎఆర్‌టి

- ఎఆర్‌టి సెంటర్లలో 14 మంది రాజీనామా
- ఫిబ్రవరి నుంచి ఖాళీగా ఉన్న వైనం
- పిఎల్ హెచ్‌ఐవి రోగులకు తీరని కష్టాలు
- కొత్త ఎపిడి వచ్చినా మారని శాక్స్ పనితీరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్లక్ష్యపు నీడ తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలిని వీడడం లేదు. అధికారులు మారితే పనితీరులో మార్పు వస్తుందని ఆశించినా అలాంటిదేమి కనిపించడం లేదు. కొత్త అధికారులు వచ్చినా అదే ధోరణి కొనసాగుతుండటంతో హెచ్‌ఐవీ రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాజం నుంచి వివక్షను ఎదుర్కొంటూ నిత్యం మందులు వాడుతూ డాక్టర్ల సలహాలను తీసుకుంటూ ఆయుష్షును పెంచుకుంటున్న వారికి తగిన తోడ్పాటునందించాల్సి ఉంటుంది. మిగిలిన రోగులకు భిన్నంగా వారు ప్రత్యేక మందులు, అవసరాలు కలిగిన నేపథ్యంలో ఆ వ్యాధి వ్యాప్తిని నిరోధించడంతోపాటు రోగులకు తగిన రీతిలో సేవలందించేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి (నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ - నాకో) ఏర్పాటైన సంగతి తెలిసిందే. రాష్ట్ర స్థాయిలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి నాకో పరిధిలో పని చేస్తున్నది.

హెచ్‌ఐవితో నివసిస్తున్న వారిని పాజిటివ్ లివింగ్ విత్ హెచ్‌ఐవి (పిఎల్ హెచ్‌ఐవి)గా పిలుస్తుంటారు. రాష్ట్ర నియంత్రణ మండలి వద్ద ఇలాంటి వారు దాదాపు 1.50 లక్షల మందికిపైగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో కొద్ది (శాతం) మంది ఇప్పటికే మరణించగా, ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 80 నుంచి 90 వేల మంది వరకు రెగ్యులర్‌గా ఎఆర్‌టి సెంటర్ల నుంచి వైద్య సేవలను అందుకుంటున్నారు. వీరి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 22 ఎఆర్‌టి సెంటర్లను ఏర్పాటు చేశారు. రోగుల రద్దీని బట్టి పెద్ద సెంటర్లలో ఇద్దరి నుంచి ముగ్గురు వరకు డాక్టర్లుంటారు. 500 పిఎల్‌హెచ్‌ఐవి రోగులకు ఒక డాక్టరు అందుబాటులో ఉండాలని నాకో నిబంధనలు చెబుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ల నోటిఫికేషన్ విడుదల చేయడం, వాటిలో రెగ్యులర్ పోస్టులొచ్చిన 14 మంది (నాకో పరిధిలో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేసే వైద్యులు) ఈ ఏడాది ఫిబ్రవరిలో తమ పోస్టులకు రాజీనామా చేయడంతో ఖాళీలేర్పడ్డాయి. వీటిని వెంటనే భర్తీ చేయాల్సి ఉంది. గతంలోనూ అలాంటి సంప్రదాయమే కొనసాగింది.

ఎఆర్‌టి సెంటర్లకు ప్రతి నెలా మందుల కోసం రోగులు వస్తుంటారు. కొన్ని సందర్భాల్లో ఇతరత్రా ఇబ్బందులెదురైతే డాక్టర్లను సంప్రదించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వీరికి నిరంతరాయంగా డాక్టర్లను అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. అయితే గత ఫిబ్రవరి నుంచి పలు ఏఆర్‌టీ సెంటర్లకు చెందిన 14 డాక్టర్ పోస్టులు ఖాళీ అయినా వాటిని భర్తీ చేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్నెల్లకు ఒకసారి వైరల్ లోడ్ తదితర పరీక్షలను నిర్వహించి వ్యాధి తీవ్రతను బట్టి మెడికేషన్ ఇస్తుంటారు. అయితే ఒక్కసారిగా నెలల తరబడి డాక్టర్లు అందుబాటులోకి రాకపోవడంతో ఎవరిని సంప్రదించాలో అర్థం కావడం లేదని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైల్‌ను కొత్తగా వచ్చిన అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీధర్, ఇన్‌ఛార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్వేతా మహంతి దృష్టికే తీసుకెళ్లకపోవడం, పూర్తి స్థాయిలో ప్రాజెక్టు డైరెక్టర్ లేకపోవడం కూడా డాక్టర్ల పోస్టుల భర్తీకి, ఇతర పనుల్లో వేగం తగ్గడానికి కారణంగా తెలుస్తున్నది. ఇప్పటికైనా వైద్యారోగ్యశాఖ మంత్రి జోక్యం చేసుకుని పోస్టుల భర్తీకి ఆదేశించాలని రోగులు కోరుతున్నారు.

ఒకేరోజు నాలుగు పరీక్షలు

- వేర్వేరు తేదీల్లో నిర్వహించాలి
- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఈనెల 30వ తేదీన ఒకేరోజు కానిస్టేబుల్, కమ్యూనికేషన్ కానిస్టేబుల్, అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) పరీక్షలను నిర్వహించడం సరికాదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించాయి. ఒకే రోజు నాలుగు పరీక్షలు నిర్వహించడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం కలుగుతుందని ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, కోట రమేష్, టి నాగరాజు, ఆనగంటి వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు పరీక్షలు రాయడానికి అర్హులైన వారికి ఒకే రోజు అన్ని పరీక్షలు నిర్వహిస్తే అన్నింటికీ ఎలా హాజరవుతారని ప్రశ్నించారు. వేర్వేరు తేదీల్లో పరీక్షలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలు, బోర్డుల మధ్య సమన్వయం లేకుండా అధికారులు ఇష్టారాజ్యంగా పరీక్షల తేదీలను ఖరారు చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నాపత్రాల లీకేజీ సమస్యతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించే పరీక్షల్లో ఎలాంటి తప్పుల్లేకుండా పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయకపోవడంతో ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీని వెంటనే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30వ తేదీన నిర్వహించతలపెట్టిన పరీక్షలు ఒకేరోజు కాకుండా వేర్వేరు తేదీల్లో నిర్వహించాలని కోరారు. నిరుద్యోగులకు ఇబ్బందులు ఎదురవకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మేడే పోస్టర్ ఆవిష్కరించిన ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐఎఫ్‌టియు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో మేడే పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎల్ పద్మ, వి ప్రవీణ్‌లు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సామాజిక భద్రత, పని గంటల తగ్గింపు కోసం మేడే స్ఫూర్తితో కార్మికవర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో కార్మికవర్గం కనీస వేతనాల్లేక, సామాజిక భద్రత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనాల్లేక నానా కష్టాలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు కార్మిక కోడ్‌ల అమలును నిలిపేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలను కార్మికవర్గం ప్రతిఘటించాలని కోరారు. కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలను కూల్చాలని, కార్పొరేట్ అనుకూల విధానాలు, పెట్టుబడిదారుల అనుకూల విధానాలపై సంఘటితంగా పోరాడాలని కోరారు. ఎనిమిది గంటల పనివిధానం కోసం పోరాటం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు లింగంగౌడ్, రవీందర్, నల్లన్న, జయ, భారతి, లత, సావిత్రి, పుష్ప వెంకటేశ్‌గౌడ్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బిజెపిని ప్రజలు నమ్మరు

- ఎంపి లింగయ్య యాదవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్ని రైతు యాత్రలు చేసినా... పాదయాత్రలు చేసినా కాంగ్రెస్, బిజెపి నాయకులను ప్రజలు నమ్మరని బిఆర్ఎస్ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ బిఆర్ఎస్ఎల్పి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సజావుగా సాగుతున్న బిఆర్ఎస్ పాలనను అప్రతిష్టపాలు చేసేలా బండి సంజయ్ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. జైలులో చిప్పకూడు తిన్న రేవంత్ రెడ్డి కూడా సిఎం కెసిఆర్‌ను విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బిజెపికి ఆదరణ లేదని కొట్టిపారేశారు. మోడీ, అమిత్‌షాలు అదానీ ఏజెంట్లు అని విమర్శించారు. మునుగోడు ఫలితమే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి రానుందని జోస్యం చెప్పారు.

టిటిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సుహాసిని

- తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షులుగా షకీలారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగుదేశం తెలంగాణ శాఖ రాష్ట్ర కమిటీ విస్తరణలో భాగంగా రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మరో ముగ్గురికి నూతన కార్యవర్గంలో చోటు కల్పించారు.

అలాగే తెలుగు మహిళా విభాగానికి కొత్త అధ్యక్షులను నియమించారు. రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులుగా నందమూరి సుహాసిని (కూకట్‌పల్లి నియోజకవర్గం), రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుధాకర్ నాయుడు (కొల్లాపూర్ నియోజకవర్గం), రాష్ట్ర కార్యదర్శిగా బి.విఠల్ (బాన్సువాడ నియోజకవర్గం)కు అవకాశం కల్పించారు. తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షులుగా షకీలారెడ్డి (ఖైరతాబాద్ నియోజకవర్గం), జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్‌గా కరాటే రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ రాష్ట్ర రాష్ట్ర కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది.

ఆర్‌టిసి, సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్‌ఆర్‌టిసి), సింగరేణి కాలరీస్‌లో తక్షణమే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఆర్‌టిసిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలంటూ కోర్టు ఆదేశించిందని, గతంలో సింగరేణి ఎన్నికలపైనా ఆదేశాలున్నాయని బుధవారం ఒక ప్రకటనలో గుర్తు చేశారు. ఈ రెండు స్వాతంత్ర్యం పూర్వం ఏర్పడిన సంస్థలని, తెలంగాణలో అత్యధిక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వ రంగం సంస్థలని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్య ప్రక్రియను పరిపుష్ఠం చేసే విధానమని, దీని ద్వారా కార్మికులు, యాజమాన్యం మధ్య అంతరాలు రాకుండా సుహృద్భావ వాతావరణం నెలకొల్పబడుతుందని తెలిపారు. తద్వారా సమస్యల పరిష్కారానికి ఉపకరిస్తుందని వివరించారు.

సర్పంచ్‌లకు పెండింగ్‌లు బిల్లులు చెల్లించాలి

రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో చేసిన పనులకు సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. ఒక్కొక్క గ్రామపంచాయతీకి రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ఇతరుల నుంచి అప్పు తెచ్చి పనులు పూర్తి చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆ బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులకు వడ్డీలు చెల్లించలేక తీవ్ర మానసిక వ్యథకు గురవుతున్నారని తెలిపారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో నిందితుడు మృతి

- కొట్టడం వల్లే చనిపోయాడని కుటుంబీకుల ఆందోళన
- ఎక్స్‌గ్రేషియా రూ.40 లక్షలివ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు అనామానాస్పద స్థితిలో మృతిచెందాడు. అయితే, పోలీసులు కొట్టడం వల్లే తట్టుకోలేక చనిపోయాడని మృతుడి కుటుంబీకులు ఆందోళన చేశారు. కుటుంబానికి రూ.40 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన హైదరాబాద్‌లో సంచలనం రేపింది. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన బుధవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సింగరేణి కాలనీకి చెందిన చిరంజీవి(38) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య మంజుల, ఇద్దరు కుమారులు, కూతురుతో కలిసి నివసించేవాడు. అయితే, మొబైళ్ల చోరీ కేసులో నిందితునిగా అతన్ని తుకారంగేట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విచారిస్తున్న సమయంలో అతను కుప్పకూలాడు. వెంటనే పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చిరంజీవి మృతిచెందాడు. చిరంజీవి గతంలో పలు కేసులలో నిందితునిగా ఉన్నాడు. అతను అనారోగ్యంతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

చిరంజీవి మరణించిన విషయం తెలుసుకున్న అతని బంధువులు, కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రికి చేరుకున్నారు. పోలీసులు కొట్టడంతోనే చిరంజీవి మరణించినట్లు ఆరోపించారు.

పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగించడంతోనే చిరంజీవి మృతిచెందాడని, తమకు న్యాయం చేయాలంటూ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. మంగళవారం రాత్రి 11 గంటలకు మృతిచెందితే.. బుధవారం ఉదయం గాంధీ ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని తీసుకువెళ్లాలని పోలీసులు తమకు ఫోన్‌చేసి చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. చిరంజీవికి ఎలాంటి అనారోగ్య సమస్యలూ లేవని, పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి కొట్టడం వల్లే చనిపోయాడని ఆరోపించారు. రూ.40లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి వరకు గాంధీ ఆస్పత్రి వద్ద ఆందోళన కొనసాగింది. ఈ క్రమంలో గాంధీ ఆస్పత్రి ప్రధాన గేటుకు పోలీసులు తాళాలేశారు. ఎవరినీ లోనికి అనుమతించలేదు.

విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె విరమణ

- ఎంఐఎం ఎమ్మెల్యే బలాలా మధ్యవర్తిత్వం
- టెర్మినేట్ అయిన 200 మందిని తిరిగి తీసుకుంటాం
- యాజమాన్యం హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు సమ్మెను విరమించారు. ఎంఐఎం ఎమ్మెల్యే (మలక్‌పేట) మహ్మద్ బలాలా మధ్యవర్తిత్వంలో సమ్మెలో పాల్గొన్న హెచ్-82 యూనియన్, ఇత్తేహద్ యూనియన్ నాయకులు టిఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు, టీఎస్ఎస్‌పిడిసిఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డితో చర్చలు జరిపారు. ఎలాంటి షరతులు లేకుండా సమ్మెను విరమిస్తున్నట్టు ఎమ్మెల్యే బలాలా, హెచ్-82 యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ సాయిలు, ఇత్తెహద్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నందీశ్వర్ ప్రకటించారు. ఆర్టిజన్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం దిశగా కృషి చేస్తామని ఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ, ఆ పార్టీ శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ హామీ ఇచ్చారనీ, అందువల్ల సమ్మెను విరమిస్తున్నట్టు తెలిపారు. సమ్మెలో పాల్గొన్న 200 మంది ఆర్టిజన్ల టెర్మినేట్ ఉత్తర్వులను పదిరోజుల్లో వెనక్కి తీసుకుంటామని సిఎండిలు హామీ ఇచ్చారని తెలిపారు. హెచ్-82 యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టిజెన్లు కేవలం ఒక్కరోజు మాత్రమే సమ్మె చేశారు. ఏప్రిల్ 15వ తేదీనే టీఎస్‌పీఈజేఏసీ నేతృత్వంలో ఏడుశాతం ఫిట్‌మెంట్, ఇతర డిమాండ్లను పరిష్కరించుకుంటూ కార్మికశాఖ కమిషనర్ సమక్షంలో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఒప్పందంలో ఆర్టిజన్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ హెచ్-82, ఇత్తేహద్ యూనియన్లు ఈనెల 25 నుంచి సమ్మెకు పిలుపునిచ్చాయి. దీన్ని తీవ్రంగా పరిగణించిన యాజమాన్యం, ప్రభుత్వం సమ్మెలో పాల్గొన్న 200 మంది ఆర్టిజన్లతో పాటు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను కూడా ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో సమ్మెపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఎట్టకేలకు సమ్మెలో మరో భాగస్వామిగా ఉన్న ఇత్తెహద్ యూనియన్ ఎంఐఎం నేతల జోక్యంతో సమ్మెను విరమించుకుంటున్నట్టు ప్రకటన చేసింది. అయితే ఈ సమ్మె సందర్భంగా ఆర్టిజన్ల డిమాండ్లు ఏవీ పరిష్కారం కాలేదు. కేవలం ఉద్యోగాల నుంచి తొలగింపునకు గురైన ఆర్టిజన్లను పది రోజుల్లో తిరిగి విధుల్లోకి తీసుకుంటామనే ఏకైక హామీని మాత్రమే యాజమాన్యం ఇచ్చింది. బుధవారం విద్యుత్ సంస్థల్లోని ఆర్టిజన్ కార్మికులు వందశాతం విధులకు హాజరైనట్టు సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు తెలిపారు.

మోడల్ ఎంసెట్‌తో విద్యార్థులకు ఉపయోగం

- ఒయు డీన్ మల్లేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడల్ ఎంసెట్ పరీక్షతో విద్యార్థులకు ఎంతో ఉపయోగం కలుగుతుందని ఒయు యుజిసి అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మల్లేశం అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షను హైదరాబాద్‌లోని నానో జూనియర్ కళాశాలలో బుధవారం ప్రశ్నాపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె అశోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మల్లేశం మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోగొట్టడానికి ఇలాంటి మోడల్ ఎంసెట్, నీట్ ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఎంసెట్, నీట్ పరీక్షల్లో రాణించేందుకు ఇవి ఉపయోగపడతాయని అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ 18 ఏండ్లుగా ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య పర్యవేక్షణలో రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ ఎంసెట్‌ను నిర్వహించామని గుర్తు చేశారు. ఈ పరీక్షల్లో రాణించిన విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే పరీక్షలో సైతం మంచి ర్యాంకులు పొందారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు సరైన అవగాహన కల్పించడం కోసమే ఈ మోడల్ ఎంసెట్, నీట్‌ను నిర్వహిస్తున్నామని అన్నారు. నానో కళాశాల చైర్మెన్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ విద్యార్థుల అవగాహన కోసం ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్న ఈ కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి, సహాయ కార్యదర్శి దామెర కిరణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, నాయకులు స్టాలిన్, శివ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్యాటరింగ్ జిఒ రద్దు చేయాలి

- కమిషనర్ ఆఫీస్ ఎదుట గిరిజన హాస్టల్ వర్కర్స్ ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో క్యాటరింగ్ విధానం రద్దు చేయాలనీ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాను ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ..క్యాటరింగ్ కోసం జీఓ నెంబర్ 527ను తీసుకొచ్చి ఇప్పుడొస్తున్న రూ.12 వేల వేతనాన్ని కూడా తగ్గించే కుట్రకు రాష్ట్ర సర్కారు పూనుకోవడం దారుణమన్నారు. ప్రతినెలా మొదటి వారంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డైలీవేజ్ వర్కర్స్‌ను క్రమబద్ధీకరించాలనీ, ఉద్యోగ భద్రత, వేతన భద్రత కల్పించాలని కోరారు. ఐదేండ్ల సర్వీస్ పూర్తయిన డైలీవేజ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికునికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ పాలసీని అమలు చేయాలని విన్నవించారు. యూనిఫామ్స్, గుర్తింపు కార్డులు ఇస్తామన్న హామీలను అధికారులు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలపై గిరిజన సంక్షేమ శాఖ ఏడీ సర్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

వేతనాలు తగ్గకుండా చర్యలు తీసుకుంటాం - ఎడి సర్వేశ్వర్‌రెడ్డి

పిఎంహెచ్ వర్కర్స్‌కు వేతనాలు తగ్గకుండా చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ ఎడి. సర్వేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. "యాక్టివిటీస్" నిర్వహణ పేరిట అవసరమైన మేరకు కార్మికులకు వేతనాలు పెంచేలా చర్యలు తీసుకుంటామనీ, డైలీవేజ్ కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి కె. బ్రహ్మాచారి, నాయకులు సంగ్యా నాయక్, ముత్తయ్య, హీరాలాల్, లక్ష్మణ్, కౌసల్య, అనురాధ, జంపయ్య, శేషు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే సినిమాలను ఆదరిద్దాం

- ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్

ప్రజాశక్తి-కల్చరల్

సమాజానికి ఉపయోగపడే సినిమాలను ఆదరించి ప్రోత్సహిస్తే మరిన్ని మంచి చిత్రాలు వస్తాయని రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా దీక్షితులు కళా వేదికపై కళా నిలయం సాంస్కృతిక సంస్థ నిర్వహణలో ఇటీవల విడుదలైన బలగం చిత్రంలోని నటులు సత్య ఏలేశ్వరం,అరుణాదేవి, సౌదామిని, సహదేవ్, కె.విద్యాసాగర్‌లను అభినందన సత్కారం చేసి మాట్లాడారు. తెలంగాణ గ్రామీణ ప్రాంత ప్రజల మనస్తత్వాలు కుటుంబ బంధాలు వాస్తవ చిత్రీకరణ బలగం అన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ కనుమరుగైపోతున్న కుటుంబ సంబంధాలు బలగం సినిమాతో ప్రజల్లో ఆలోచన రేకెత్తించిందని అన్నారు. ఎం.వి.రావు, వీరభోగ వసంత రాయలు, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ స్మారక పురస్కారాలు ప్రముఖులకు సంస్థ అధ్యక్షులు పుష్పలత సారథ్యంలో అతిథులు బహూకరించారు. కార్యదర్శి సురేందర్ స్వాగతం పలికారు. నటి సౌందర్య జయంతిని పురస్కరించుకొని ఆమె నటించిన సినిమాలో పాటలు బాపిరాజు, సుబ్బిరెడ్డి, రేవతి తదితరులు ఆలపించారు.

ఫెమినిస్ట్ దృక్కోణంలో మహాభారత మగువలు

ప్రజాశక్తి-కల్చరల్

అనాదిగా మనకు భీష్ముడు వంశ అభివృద్ధికి త్యాగమూర్తిగా, ధర్మరాజు సత్యవ్రతునిగా, అర్జునుడు, భీముడు బల పరాక్రమాలుగా, కర్ణుడు దాన గుణం వంటివి విన్నాం. మహాభారతంలో స్త్రీ పాత్రల స్వభావం వారి గొప్ప గుణాల గురించి అంతగా చెప్పలేదు. ఆ కావ్యంలోని స్త్రీ పాత్రల మనోభావాలు విశ్లేషిస్తూ నిసుంభిత స్కూల్ ఆఫ్ డ్రామా వారిచే డాక్టర్ రామమోహన హోలగండి నాటకీకరించి దర్శకత్వం వహించిన మహాభారతంలో మగువలు నాటకం ఫెమినిస్ట్ దృక్కోణంలో రవీంద్రభారతీ ప్రధాన వేదికపై ప్రదర్శితమైంది. ప్రతి నెల టికెట్‌పై నాటకం అనే నినాదాన్ని ఉద్యమంలా తీసుకెళ్తున్న రసరంజని నాటక సంస్థ నిర్వహణలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. మహా భారతంలోని స్త్రీ పాత్రలు భీష్ముడు తండ్రిని వివాహమాడిన సత్యవతి, ఆయనపై శపథం చేసిన అంబ, అవివాహితగా కర్ణుని కన్న కుంతి, భర్త పుట్టు గుడ్డి కావున తన కళ్ళకు గంతలు కట్టుకున్న గాంధారి పాత్రలను విశ్లేషణ చేస్తూ ఒక కుటుంబంలో జరిగిన చర్చగా ఈ నాటకం ఆసాంతం ఆసక్తికరంగా సాగింది.

దీక్షలో మాట్లాడుతున్న షర్మిల

సరైన పాలన లేనందునే రాజకీయాల్లోకి వచ్చా

- వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల
- ఇందిరాపార్క్ వద్ద 'టి-సేవ్' నిరుద్యోగ దీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సిఎం కెసిఆర్ సరైన పాలన ప్రజలకు అందించడం లేదని, అందువల్లే రాజకీయాల్లోకి వచ్చానని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. వైఎస్సార్‌టిపి ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్క్ వద్ద 'టి-సేవ్' నిరుద్యోగ దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు ప్రొఫెసర్ కాశీం, ప్రజా గాయకుడు గద్దర్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. నిరుద్యోగ దీక్షకు అనుమతి ఇవ్వకపోవడంతో కోర్టుకు వెళ్లి అనుమతి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తన దీక్షను ఆపాలని విశ్వప్రయత్నాలు చేశారని.. అందులో భాగంగానే అరెస్టు చేశారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి మహిళలు అంటే లెక్కలేదని, మాజీ ముఖ్యమంత్రి భార్య విజయమ్మకు గౌరవం ఇవ్వకుండా అడ్డుకున్నారన్నారు. పోలీసులను అవమానపరచడం తన ఉద్దేశం కాదని.. వారు తన మీద పడుతుంటే సెల్ఫ్ డిఫెన్స్ కోసం తోయాల్సి వచ్చిందని తెలిపారు.

ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబం మొత్తం స్కాముల్లో కూరుకుపోయిందన్నారు. తండ్రి ప్రాజెక్టుల స్కాం.. కూతురు లిక్కర్ స్కాం.. సన్ పేపర్ స్కాంలకు పాల్పడ్డారని ఆరోపించారు. టిఎస్‌పిఎస్‌సి కేసులో 19 మందిని మాత్రమే దోషులుగా చిత్రీకరించారన్నారు. పాత్రధారులను మాత్రమే పట్టుకుని సూత్రధారులను వదిలేశారని విమర్శించారు. కెటిఆర్‌ను కాపాడటంలో భాగంగానే సిట్ విచారణ సాగుతుందన్నారు. టి-సేవ్ తరపున సిఎం కెసిఆర్‌కు పది ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రాన్ని పంపుతున్నామని.. దమ్ముంటే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ ఒక్క పరీక్ష కూడా సక్రమంగా నిర్వహించలేదన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ రాలేదని, విద్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. నాణ్యమైన విద్య అందాలంటే తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల పునర్నిర్మాణం జరగాలని చెప్పారు. టిఎస్‌పిఎస్‌సి దోషులను కఠినంగా శిక్షించి రాష్ట్రవ్యాప్తంగా ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఆస్తి కోసం వైఎస్ వివేక హత్య జరగలేదు : వైఎస్ షర్మిల

ఆస్తి కోసం వైఎస్ వివేక హత్య జరగలేదని వైఎస్ షర్మిల అన్నారు. నిరుద్యోగ దీక్ష అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ.. తన చిన్నాన్న వివేకానందరెడ్డి పేరుపై గానీ, చిన్నమ్మ పేరుపై గానీ ఎలాంటి ఆస్తులు లేవని తెలిపారు. ఆస్తులన్నీ కూతురు వైఎస్ సునీత పేరు మీద వీలునామా రాశారని స్పష్టం చేశారు. ఉన్న చిన్నపాటి ఆస్తులను సునీత పిల్లలపై రాశారని చెప్పారు. వివేకానందరెడ్డి ప్రజల మనిషిని .. ఆయన గురించి కడప, పులివెందుల ప్రజానీకానికి బాగా తెలుసన్నారు. ప్రజలకు ఏదేని సమస్యలు వస్తే వారితో కలిసి నేరుగా అధికారుల వద్దకు వెళ్లి పరిష్కరించేవారని గుర్తు చేశారు. లేని వైఎస్ వివేకానందరెడ్డిపై వ్యక్తిగత విషయాలు ప్రస్తావించడం దారుణమన్నారు.